## ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అంజిరెడ్డి


ప్రమాణ స్వీకారం చేస్తున్న అంజిరెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** బిజెపి తరఫున పోటీచేసి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించిన డాక్టర్ సి.అంజిరెడ్డి శాసన మండలి చైర్మన్ గుత్తసుఖేందర్‌రెడ్డి సమక్షంలో సోమవారం శాసన మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన అంజిరెడ్డిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనను శాసన మండలి మెట్లు ఎక్కేలా సహకరించిన పట్టభద్రులకు, పార్టీ నాయకులకు అంజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## తపస్‌పల్లిలో పాదయాత్ర


పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొమురవెల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తపస్‌పల్లిలో సోమవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. గ్రామంలో అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేద్కర్, మహాత్మాగాంధీ, రాజ్యాంగాన్ని చేత పట్టుకొని పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహా దేవుని శ్రీనివాస్, నాయకులు బాలరాజు, శ్రీని వాస్, కృష్ణ, లింగంపల్లి శ్రీనివాస్, శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, ఎల్లయ్య, రాజలింగం, రమేష్, రాజు, ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జున్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి దోహదం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఎంతో దోహపడుతుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి తిరిగి దరఖాస్తు పెట్టుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి దేవాలయం ఈవోగా అన్నపూర్ణ

**కొమురవెల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం ఈవోగా ఎస్.అన్నపూర్ణ సోమవారం దేవాలయ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం ఈవోగా పనిచేసిన అన్నపూర్ణ బదిలీపై కొమురవెల్లి ఈవోగా వచ్చారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్లు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికే ప్రజావాణి అని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ రోజు వచ్చిన 65 ప్రజావాణి అర్జీలలో ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూసర్వే, గ్రామ పంచాయతి, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యల పై దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై పిర్యాదులను పరిశీలించారు. ఆన్లైన్ రికార్డు చెక్ చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డి ఆర్ ఓ పద్మజ రాణి,జడ్పీ సీఈవో జానకి రెడ్డి జిల్లా వైద్య అధికారిని గాయత్రి వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

**వర్గల్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా సాయంత్రం 8.30 గంటల ప్రాంతంలో బందోబస్తు చేపట్టిన గౌరారం పోలీసులకు ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా పట్టుకునేందుకు వెళ్లగా వారు పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నట్లు గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిలు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. రామాయంపేటమండలం నాస్కల్ గ్రామానికి చెందిన ఎండి.ఎథిజాజ్(22), సికింద్రాబాద్ నేరెడ్‌మెట్‌కు చెందిన ఎండి.హిధాయత్ అలీ(23), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గబ్బిలాలపేట్ బాలాజీనగర్‌కు చెందిన మద్దూర్ లాలు(24)లు పట్టుకొని వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా వాటిలో ఒక పిస్టల్, 35 బుల్లెట్స్, ఒక నకిలీ పిస్టల్, 4 పెప్పర్ స్ప్రే బాటిల్స్, 2 ఐరన్ నకిల్ దస్తర్లు, నకిలీ ఆధార్ కార్డులు, మెమరీ కార్డులు, లభ్యమయ్యాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న వస్తువులను, ఒక హోండా యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా ఆర్థిక సమస్యల కారణంగా వారు మహిళల మెడలో నుండి బంగారు చైన్‌లు, ద్విచక్ర వాహనాలు దొంగతనం చేయడానికి కుట్ర చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బీహార్ రాష్ట్రంలోని ముంగర్ పట్టణానికి వెళ్ళి పిస్తోలు, 38 బుల్లెట్స్ కొనుగోలు చేయడం జరిగిందని, జవహర్ నగర్ పిఎస్ పరిధిలోని ఒక అడవి వద్ద ఒక రౌండ్ షూటింగ్ ప్రాక్టీస్ చేసినట్లు ఒప్పుకున్నారు. ఈనెల 2వ తేదీ నుండి 5వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని సుప్రభాత్ హోటల్ లాడ్జిలో ఉంటూ సికింద్రాబాద్ చుట్టుపక్కల నేరాలు చేయడానికి ప్రయత్నించగా సిసి కెమెరాలు ఉన్న కారణంగా అక్కడ చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో నేరాలు చేయడానికి నిర్ణయించుకొని వర్గల్ గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం గజ్వేల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.


అనుమానాస్పద నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న గజ్వేల్ రూరల్ సిఐ, గౌరారం ఎస్ఐ

# పేద కుటుంబాలకు మేలు 'సన్న బియ్యం'

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం ప్రవేశపెట్టడం శుభపరిణామం అని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సన్న బియ్యం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనాలు తెలుసుకోవడానికి క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా రాంపూర్‌లో విస్తృతంగా పర్యటించి సన్న బియ్యం పథకం లబ్ధిదారులతో మాట్లాడి స్వయంగా కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారు దుర్గ రాజు గృహంలో కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ రాహుల్‌రాజ్ భోజనం చేశారు. భోజన సమయంలో కుటుంబంతో ఆత్మీయంగా మమేకమై వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గ రాజు కుటుంబ సభ్యులు సన్న బియ్యం పథకం మా కుటుంబానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. సన్న బియ్యం అన్నంతో కడుపునిండా తింటున్నామని, ఎంతో మంది పేదలకు ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు.మానవతా దృక్పథంతో నడిపిస్తున్న గొప్ప పథకం అని రాష్ట్ర ప్రభుత్వానికి వారు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 520 రేషన్ షాపులకుగాను 7 లక్షల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ జిల్లాలో సమర్థవంతంగా అమలవుతుందని తెలిపారు. సన్న బియ్యం సరఫరా చేయడంవల్ల రుచికరమైన భోజనం చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత గల సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం రేషన్ షాపుల ద్వారా తీసుకుని దొడ్డు బియ్యం క్వాలిటీ బాగోలేక రీసైకిలింగ్ చేయడం, వేరే వారికి అమ్మడం జరిగేదని తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, రాష్ట్ర ప్రభుత్వం వీటన్నిటికీ చెక్ పెడుతూ సన్న బియ్యం కార్యక్రమాన్ని ముందుకు తీసుకువచ్చిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధిదారుల స్పందన తెలుసుకోవడానికి కొల్చారం మండలం రాంపూర్ గ్రామ సందర్శించడానికి రావడం జరిగిందని కలెక్టర్ వివరించారు. సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి ఒక్కరూ రుచికరమైన భోజనం చేస్తున్నామని, అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని లబ్ధిదారు స్వయంగా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, సంబంధిత ఇతర శాఖల అధికారులు, కొల్చారం తహశీల్దార్ గఫార్ మియా, ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, ఎంపీఓ కృష్ణవేణి, రాంపూర్ గ్రామ కార్యదర్శి విఠల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లి రాజు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.


ఎస్ఆర్ఆర్ మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశిక

## ఖేడ్‌లో కల్తీ వస్తువుల కలకలం

### -ఎస్ఆర్ఆర్ మార్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా అధికారి శ్రీశిక

**నారాయణఖేడ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** పట్టణంలోని ఎస్ఆర్ఆర్ మార్ట్‌ను సోమవారం జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ శ్రీశిక తనిఖీ చేశారు. అధికారులు ఇచ్చిన సమాధానాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. రెండు రోజుల క్రితం ఇడ్లీ రవ్వలో పురుగులు వచ్చాయని సోషల్ మీడియాలో ప్రచారంతోపాటు జిల్లా అధికారులకు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఇడ్లీరవ్వలో పురుగులు వచ్చాయని రెండు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, అదినా పరిధి కాదని సమాధానం ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రత అధికారి శ్రీశిక తనిఖీకి రాగా కాలం చెల్లిన వస్తువులు, పురుగులతో కూడిన ఇడ్లీరవ్వ ఇతర వస్తువులు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని రికార్డులను పరిశీలించి నమూనాలు సేకరించారు. సాక్షాత్తు అధికారిముందు కాలం చెల్లిన వస్తువులు, పురుగులతో కూడిన రవ్వ కనిపించినా చర్యలు తీసుకునే అధికారం నాకు లేదని అధికారి చెప్పారు. ఈ విషయం గురించి మున్సిపల్ కమీషనర్‌కు వివరణ కోరగా సీజ్ చేసే అధికారం మాకు లేదని చెప్పారు. తనిఖీకి వచ్చిన అధికారి కొన్ని ఆహార వస్తువులు పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు. మార్ట్‌లో కాలం చెల్లిన గోధుమ పిండి, మినప పప్పు, కంది పప్పు బస్తాలు ఉన్నా, వచ్చిన అధికారి మార్ట్ నిర్వాహకులను కనీసం మందలించకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. నాణ్యత రహిత వస్తువులు, ఆహార పదార్థలు, ఆహార దినుసులు కళ్ళముందే కనబడుతున్నా కనీసం మందలించలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఖేడ్‌లోని ఎస్ఆర్ఆర్ మార్ట్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పర్యాటక కేంద్రాలుగా పటాన్‌చెరు చెరువులు

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్ చెరు,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామ పరిధిలోని ఎంక చెరువులను హెచ్‌ఎండిఏ ద్వారా 10 కోట్ల 78 కోట్ల లక్షల రూపాయలతో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రెండు చెరువుల వద్ద సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు, ముత్తంగి పరిధిలో ప్రజలకు ఆహ్లాద కేంద్రాలుగా ఉండేందుకు చెరువులను సుందరీకరణ చేపడుతున్నామన్నారు. ప్రతి చెరువుకట్టపైన సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్క్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నిధులు సరిపోనిపక్షంలో సిఎస్ఆర్ ద్వారా మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్‌ఎండిఏ చెరువుల విభాగం డిఈ రామకృష్ణ, ముత్తంగి మాజీసర్పంచ్ ఉపేందర్, తెల్లాపూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్చెరువు పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కుమార్‌గౌడ్, సిల్వేరి శ్రీనివాస్, మేరాజ్‌ఖాన్, కిట్టు, రామకృష్ణ, యాదయ్య, ప్రభాకర్ గుప్తా, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

### వేసవిలో వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి : ఏఎన్ఎం

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** వేసవికాలంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలని ఏఎన్ఎం మంజుల అన్నారు. సోమవారం చాట్లపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎండకు వెళ్ళి రాగానే వెంటనే నీటిని తాగవద్దని, ఎండలో ప్రయాణించేటప్పుడు తలకు టోపి లేదా రుమాలు ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ మమత, సిఏ సుదర్శన్, నాయకులు బీరయ్య, మల్లయ్య, జనార్ధన్‌రెడ్డి, ప్రజలు ఉప్పలయ్య, రేణుక, కళ్యాణి, శ్రీను, రాములు పాల్గొన్నారు.

# జిల్లాలోని భూ సమస్యలను పరిష్కరించాలి

### సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** జిల్లాలో ఉన్న భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్థలాలు, ఉపాధి హామీ, రోడ్లు, ఇతర స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ధర్నానిర్వహించడం జరిగింది. అనంతరం అడిషనల్ కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అజ్జమర్రి మల్లేశం మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజల సమస్యలపై నెల రోజులుగా సిపిఎం కార్యకర్తలు ప్రజల దగ్గరకు వెళ్లి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో భూ సమస్యలు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ సమస్యలు, ఉపాధి హామీ సమస్యలు, సాగునీరు,తాగునీరు, పింఛన్లు, ఇతర స్థానిక సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జాప్యం అందరికీ ఒకేసారి అందకపోవడంలాంటి సమస్యలు సిపిఎం దృష్టికి వచ్చాయన్నారు. ముఖ్యంగా కాలేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మల్లన్న సాగర్ నుండి సింగూర్ ప్రాజెక్టు వరకు నిర్మించే ప్రధాన కాలువ పనులు నిలిచిపోయాయని, సగం కాలువ తవ్వి వదిలేయడంవల్ల కాలువలను ఆనుకొని ఉన్న గ్రామాల రవాణ సౌకర్యం దెబ్బతింటుందన్నారు. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట మండలాల పరిధిలో సగం నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం కాలువల పనులు వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. మనోహరాబాద్, శివ్వంపేట, నర్సాపూర్ మండలాల పరిధిలో కాళేశ్వరం కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. టేక్మాల్, పాపన్నపేట, అల్లాదుర్గం మండలాలకు సాగునీరు అందించే గుండువాగుకు సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా నీళ్ల తరలించాలన్నారు. ఘణపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనులు నిలిచిపోయాయని, వెంటనే వాటిని పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు సరిపడా తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ పట్టణంలో, నర్సాపూర్ కేంద్రంగా ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే అర్హులైన పేద ప్రజలకు కేటాయించక పోవడంతో అర్హులైన పేద ప్రజలు ఇల్లు లేక అనేక అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. రామయంపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో 16 కుటుంబాలకు ఇళ్లు లేక గుడిసెల్లో 20 సంవత్సరాలుగా బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నారని, వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటి స్థలం లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను వెంటనే మంజూరు చేసి ఇల్లు కట్టివ్వాలన్నారు. చిలిపిచెడ్ మండలం చండూర్ గ్రామంలో నిరుపేదలకు గతంలో ఎన్నో సర్టిఫికెట్‌లు ఇచ్చారు కానీ, పొజిషన్ చూపించలేదన్నారు. మెదక్ నుండి పిల్లికొట్టాల్ మీదుగా వెల్దుర్తి వరకు డబుల్ రోడ్డు వేయాలని, మెదక్ నుండి ఎల్కతుర్తి వరకు పనులు స్పీడఅప్ చేయాలన్నారు. శివ్వంపేట మండలంలో చండి నుండి గోమారం వరకు, శివ్వంపేట మండల కేంద్రంలోని పిలుట్ల నుండి సిరికపల్లి వరకు, పెద్దగొట్టిముక్కుల తండా నుండి సీతారాంతండా వరకు బిటిరోడ్డు నిర్మించాలన్నారు. నర్సాపూర్ మండలంలో కొండాపూర్ నుండి హత్నూర మండలం జార్కంపల్లి వరకు టవల్ రోడ్డు వేయాలని, అలాగే గంగారం గేట్ నుండి ఫైజాబాద్ వరకు నూతన డబల్ రోడ్డు నిర్మించాలన్నారు. కౌడిపల్లి మండలంలో వెంకట్రావుపేట నుండి వెంకటాపూర్ వరకు, ఉజరంపేట మీదుగా దుంపలకుంట వరకు డబల్ రోడ్డు నిర్మించాలన్నారు. అల్లాదుర్గ మండల కేంద్రం నుండి వయా జగిర్యాల నుండి అల్లాదుర్గం ఐబి వరకు రోడ్డు మరమ్మత్తులు చేయకపోవడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని అయినా అన్నారు. అల్లాదుర్గం ఐ.బి నుండి వయా వట్పల్లి మీదుగా జహీరాబాద్ ప్రధాన రహదారి వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలన్నారు. నాగపూర్, చేగుంట ,నార్సింగి, మాసాయిపేట, కౌడిపల్లి, కొల్చారం, పాపన్నపేట, టేక్మాల్, మెదక్, నర్సాపూర్, వెల్దుర్తి మండలాలలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అందులో పోడు పట్టాలు ఇచ్చే భూములతో పాటు బిన్నీ తొలగించే భూములు ప్రభుత్వ భూమిగా గుర్తించి పట్టా సర్టిఫికెట్‌లు ఇచ్చే భూములు ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోరెంకల మల్లేశం, బాలమణి, జిల్లా కమిటీ సభ్యులు గౌరి, సంతోష్, అజయ్, జిల్లాలోని వివిధ గ్రామాల భూ సమస్య, రోడ్డు సమస్య, ఇండ్ల సమస్యలు, ఉపాధి హామీ సమస్యల బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోవద్దు

### -ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొంది లాభాలు ఘడించాలని, తొందరపడి తక్కువ ధరకు దళారులకు విక్రయించవద్దని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన సన్న వడ్లకు రూ.500 బోనస్‌ను గతంలో అందించిందని, రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయంగా ప్రజాపాలన సాగిస్తున్నారని, నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రతి ఒక్క రైతు ధాన్యం కొనుగోలుకేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, చాట్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాచర్ల నరేష్, మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు, ఏపిఎం కిరణ్, సిసి దేవరాజ్, సిఏ సుదర్శన్, గ్రామ మహిళ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కళ్యాణి, జి.రేణుక, కాంగ్రెస్ నాయకులు బరిగె నర్సింలు, పనుగంటి రాజు, భూమల్ల మల్లయ్య, బీరయ్య, బరిగె కనకయ్య, ఎన్.జనార్ధన్‌రెడ్డి, బరిగె శ్రీను, కరుణాకర్, శ్రీను, వర్కొళ్ల సత్యనారి, హమాలీ సంఘం అధ్యక్షుడు బోగర్ల కొండయ్య, ఏఈఓ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సాయిబాబా, ఎఫ్ఏ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** రైలు కింద పడి వ్యక్తి మృతి చెందినట్లు కామారెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ హనుమాగౌడ్ సోమవారం తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడియారం-మిర్జాపల్లి రైల్వే మార్గంలో కామారం తండా శివారులో రైల్వే గేటు 226 వద్ద సుమారు 32 నుండి 35 సంవత్సరాలుగల వ్యక్తి మృతదేహం పడి ఉందని స్థానికులు రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రైలుకింద పడటంతో మృతుని ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా ఉన్నాయని, శరీరభాగాలు ముక్కలుగా పడి ఉన్నామని తెలిపారు. మృతుడు ప్రమాద వశాత్తు రైలు నుండి జారి పడ్డాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా అని తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని కామారెడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ హనుమాగౌడ్ తెలిపారు. వివరాల కోసం 8712568440కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నర్సాపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** తాగుడుకు అలవాటు పడి ఉరి వేసుకుని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని చైతన్యపురి కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై జగన్నాథం కథనం ప్రకారం.. నర్సాపూర్ సమీపంలోని చైతన్యపురి కాలనీకి చెందిన మల్లెపూల వెంకటేష్ (45) ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడని తెలిపారు. తాగుడుకు బానిసై ఇంటి లో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు అన్నారు. ఈ మేరకు 6వ తేదీ రాత్రి మద్యం తాగి వచ్చి భార్య సంతోష, కుటుంబ సభ్యులతో గొడవపడగా వారు మందలించి రాత్రి మూడు గంటలకు పడుకోబెట్టినట్టు తెలిపారు. ఈ మేరకు తెల్లవారి చూసే వరకు తాను పడుకున్న బెడ్ రూమ్ లో ఒక రాడ్ కు తన అంతట తానే ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సంతోష ఫిర్యాదు మేరకు ఎస్సై కే జగన్నాథం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

### -920 గ్రాముల గంజాయి, రూ.33వేల స్వాధీనం



అరెస్ట్ చేసిన యువకులను చూపిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

**ములుగు, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను ములుగు పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... ములుగు మండలం కొట్యాల గ్రామ శివారులో ఐదుగురు యువకులు గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో పోలీస్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని ఐదుగురు యువకులను పట్టుకొని వారినుండి 920 గ్రాముల గంజాయి, రూ.33వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు చరవాణిలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతకొంత కాలంగా అక్రమంగా గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించగా వారిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఎవరైనా గంజాయి సేవించినట్లు, విక్రయించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## సరాఫ్‌పల్లిలో బంగారం, వెండి, నగదు చోరీ


చోరికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ పాటిలన క్రాంతి కుమార్

**చౌటకూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని దుండగలు ప్రవేశించి బంగారం,వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకుపోయిన ంసఘటన మండల పరిధిలోని సరాఫ్‌పల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పుల్‌కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వంజరి స్వాతి ఇంట్లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న సంతోష్ భార్య పిల్లలతో అద్దెకు ఉంటోంది. కుటుంబ సభ్యులందరు ఆదివారం సాయంత్రం హత్నూర మండలం మాదారం దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లి రాత్రికి ఆలయంలోనే బస చేశారు. సోమవారం ఉదయం 6.30గంటలనఎ ఇంటికి చేరుకోగా ఇంటి తాళం పగలకొట్టిన దృశ్యాలు చూసి ఖంగుతిని ఇంట్లోకి వెళ్లి చూడగా సమాగ్రి చిందర వందరగా పడి ఉండటంతో పాటు బీరువాలో దాచిన తులం బంగారం నగలు, 29తులాల వెండి పట్టీలు 20వేల రూపాయలు చోరీకి గురైనట్లు గుర్తించారు. చీరి జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని దుండగుల వేలి ముద్రలు, ఇతర ఆదాదాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి తదితరులు

## "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" లో భాగస్వాములు కావాలి

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్"లో భాగస్వాములు కావాలి గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నర్సాపూర్ మండలం తుజల్పూర్, తిరుమలపూర్ గ్రామాలలో "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" రాజ్యాంగ పరిరక్షణ సన్నాహ సమావేశం, పాద యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారత రాజ్యాంగ అమలుకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ను అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా "జై బాపు, జై భీమ్" కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. చేతిలో గాంధీ, అంబేద్కర్ చిత్ర పటం పట్టుకొని పాదయాత్రలో పాల్గొన్న ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్త, నర్సాపూర్ మాజీ ఎంపీపీ లలితనర్సింగ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేష్, మాజీ ఎంపీటీసీ మేఘమాల, రాజు యాదవ్, తుజల్ పూర్ గ్రామ అధ్యక్షులు అనిల్, లక్ష్మీనారాయణ, నర్సాపూర్ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్, నర్సాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్,మోహన్ దాస్ గౌడ్, ఆంజనేయులు, సుధీర్ కుమార్ గౌడ్, ఆకుల నర్సింలు, క్రిష్ణగౌడ్, సంజీవ, నగేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## విద్యార్థులు అంకితభావంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** విద్యార్థులు అంకితభావంతో చదివి ఉన్నత చదువులు చదవి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని నర్సాపూర్ కోర్టు న్యాయవాదులు అన్నారు.జాతీయ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశానుసారం మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పి లక్ష్మి శారద, జిల్లా కార్యదర్శి సిహెచ్ జితేందర్ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఆర్. సిరి సౌజన్య ఆధ్వర్యంలో సోమవారం నారాయణపూర్ లో గల ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ లీగల్ సర్వీసెస్ న్యాయవాదులు జి శ్రీనివాస్ గౌడ్, సిహెచ్ స్వరూప రాణి, ఏ శ్రీనివాస్, ప్రభుత్వా న్యాయవాది పి సుధాకర్, కే రాజు నాయక్, ఎస్పి జగన్నాథం లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు బాల్యవివాహాలు, తండ్రి ఆస్తిలో ఆడపిల్లలకు సమాన వాటా, బాల కార్మిక వ్యవస్థ, ఫోక్స్ చట్టం, షీ టీం తదితర చట్టాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతేగాక విద్యార్థులు మంచి పోష్టకాహారమైన ఆహారాన్ని తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గాడ్సే వారసులు బిజెపి నేతలు

**-డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**


మాట్లాడుతున్న తూంకుంట నర్సా రెడ్డి

**వర్గల్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** పూజ్య మహాత్మగాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నేతలు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సా రెడ్డి విమర్శించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్లో భాగంగా సోమవారం వర్గల్లో పాదయాత్ర చేపట్టి ప్రజలను చైతన్యం చేసిన సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ ప్రీతంతో కలిసి ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోడీ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును కార్పోరేట్ గద్దలకు కట్టబెడుతున్నట్లు ఎద్దేవ చేశారు. కరెన్సీ నోట్లపై గాంధీ చిత్రాన్ని తొలగించేందుకు కూడా బిజెపి వెనుకాడదని, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ను అవమానించడం మోడీకి ఆనవాయితీగా మారిందని చెప్పారు. మహిళల హక్కులపై అంబేద్కర్ మాట్లాడగా, ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేసిన ఘనత చరిత్ర ఆర్ఎస్ఎస్దే అని అన్నారు. కార్పోరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న బిజెపి సర్కార్ నిరుద్యోగ సమస్యను సైతం నిర్మూలించలేకపోయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఆంక్షరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సందీప్రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్గౌడ్, మాజీ ఎంపిపి మోహన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ పేదలకు కొండంత అండ

**ఎమ్మెల్యే సునీతా రెడ్డి**

**నర్సాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** సీఎంఆర్ఎఫ్ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ మేరకు నర్సాపూర్ పట్టణానికి చెందిన ఎండి జూబునిస్స అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసు కున్నారు. ఈ మేరకు వారికి మంజూరైన 15 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సునీతా రెడ్డి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగ పడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నహీమొ ద్దీన్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యం గౌడ్, నాయకులు రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, మహమ్మద్, రాకేష్ గౌడ్, హైమద్, సలీం, సద్దాం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల శాంతి ర్యాలీ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : పాస్టర్ ప్రవీణ్ ఇటీవల మరణించిన సంఘటనకు సిద్దిపేటలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సత్యానందం మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. క్రైస్తవులపై వివక్షతో వ్యవహరించొద్దని..ప్రతీకారాలు వద్దని మానవత్వమే ముద్దు అన్నారు. ప్రవీణ్ను కోల్పోవడం బాధకరమన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి వారి కుటుంబానికి క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

# దేవుని పేరుతో రాజకీయం చేయొద్దు

**ఎంపి సురుష్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి**


మాట్లాడుతున్న ఎంపీ సురుష్ కుమార్ షెట్కార్

**నారాయణఖేడ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ఏఐసీసీ ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తీసుకున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్లో కార్యక్రమంలో భాగంగా సోమవారం నారాయణఖేడ్ మండల పరిధిలోని పైడిపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఇన్ఛార్జి ధనలక్ష్మిలు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. అనంతరం ఎంపీ సురుష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే అన్ని వర్గాలకు, అన్ని కులాలకు చెందిన పార్టీ అని, అన్ని వర్గాలకు సమన్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణకై పాటుపడిన స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ లాంటి వారిపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టి ఆ మహత్ముల ప్రతిష్టలను దెబ్బతీయాలని చూస్తున్న బిజెపి సర్కార్కు బుద్ధి చెప్పాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పైన చేసిన ఆరోపణలను మనందరం అర్థం చేసుకోవాలని, బిజెపి సర్కార్ రాజ్యాంగంపై చేసిన ఆరోపణలను ప్రజలందరూ అర్థం చేసుకోవాలన్నారు. పేదవాడి కడుపు నింపాలని ఇప్పుడున్న సమాజంలో ఒక గొప్పవాడే సన్న బియ్యం తినే పరిస్థితుల్లో ఉంది, కానీ మా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి ఒక ఉన్నవాడే కాకుండా, ఒక పేదవాడు కూడా ప్రతి ఒక్కరూ సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్న బియాన్ని పంపిణీ చేస్తుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన పది సంవత్సరాల నుండి ఏ ఒక్క రోడ్డును వేయకుండా కేవలం బిఆర్ఎస్ నాయకులు ఆస్తులను ఎలా పెంచుకోవాలి, ఎలా సంపాదించాలి, కబ్జాలను చేస్తూ 10 సంవత్సరాలగా కాలయాపన చేశారన్నారు. ఏ ఒక్క రోడ్డుపైన కానీ కనీసం గుంతలను పూడ్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్ షెటట్కార్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కర్నె శ్రీనివాస్ పిసిసి సభ్యులు, తాహెర్ మండల అధ్యక్షులు, రమేష్ చౌహాన్, వినోద్ పాటిల్, పండరి రెడ్డి, లక్ష్మీ మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లక్ష కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్న బిఆర్ఎస్

**-రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ నగారి ప్రీతం**

**వర్గల్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో పదేళ్ల పాలన చేసిన బిఆర్ఎస్ పార్టీ రూ.లక్ష కోట్ల ప్రజల సొమ్మును దోచుకోగా, అదే సొమ్ముతో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ నగారి ప్రీతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా గౌరారంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూం కుంట నర్సారెడ్డితో కలిసి మాట్లాడారు. మాటలతో మభ్యపెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్, హరీష్‌రావు కంచగట్టు భూములపై దుష్ప్ర చారం చేస్తూ సోషల్ మీడియా ద్వారా నెమళ్ళు, జింకలు, పక్షులను చంపుతున్నట్లు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలతో కుట్రలు చేస్తుండగా, తమకు చట్టాలు, రాజ్యాంగంపై పూర్తి నమ్మకం ఉందని తద్వారా రాష్ట్ర సంక్షేమం భేష్గా ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి ఆమోదింప జేసిందని, అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ తో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్, ఉద్యోగ నియామకాల్లో న్యాయం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులకు రిజర్వేషన్లు కీలకం కానున్న తరుణంలో వాటిని ఎత్తివేసే కుట్ర జరుగు తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతిపక్షాలు జీర్ణించుకో లేకపోతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇక్కడి బిజెపి మంత్రులు కేంద్రం నుండి రావాల్సిన నిధులను సాధించలేకపోతుండగా, ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నట్లు ఆరోపిం చారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కాగా, మరో పదేళ్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయ లేరని విమర్శించారు. అనంతరం దళిత వాడలో ప్రభుత్వం పంపిణీచేసిన సన్న బియ్యంతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంక్షరెడ్డి, నిమ్మ రంగారెడ్డి, సందీప్‌రెడ్డి, విద్యాకుమార్, నీల శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, భానుప్రసాద్ గౌడ్, బొర్క నర్సింలు, గుండు నర్సింలుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్, సాయిగౌడ్, అశోక్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో తండ్రికి సహాయం చేస్తున్న రైతుబిడ్డలు

**యాచారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి చెందిన ఓ రైతు తన పంటపొలాల్లో కూరగాయల సాగుచేస్తున్న తరుణంలో కలుపు తీసేయ టానికి పనిముట్లతో కాకపోవడంతో తన కొడుకుబిడ్డతో గుంటుక నాగలి పని చేస్తున్నారు. రైతు కుటుంబంలో పుట్టడం వల్ల తమ పిల్లలు క్రమశిక్షణ పనివిలువ జీవనవిధానం సర్వసాధారణంగా ఉంటుందని రైతు తెలిపారు. రైతుబిడ్డకు వృత్తినైపుణ్య శిక్షణ పొందడంలో ఉద్యోగరీత్యా ఒక్కరివద్ద ఉన్న వాళ్ళ దగ్గర పనిచేయడం కూడా సులువుగా ఉంటుందని రైతులు పెద్దలు తమ అభిప్రాయాలనువ్యక్తంచేస్తుంటారు.రైతులుపంటలుపండించి లాభాలు లేకున్నా పెట్టినపెట్టుబడికి గిట్టుబాటు ఉంటే సరిపోతుందని సంతృప్తి చెందుతుంటారు. ఎంతకష్టం చేసినా లాభంరాకుండా నష్టమే జరుగుతుం దని తెలిసికూడా పదేపదే చేసేదే వ్యవసాయమని విశ్లేషకులు రైతు శ్రేయో భిలాషులు అం టుంటారు. ప్రభుత్వాలు ఆధునికయంత్రాలను సబ్సిడీ ద్వారా అందజేయాలని రైతేరాజు రైతురాజ్యం అనిపొగిడే ప్రజాప్రతినిధులు అధికారులు వారికి అధికంగా సబ్సిడీలలో సౌకర్యాలుకల్పించాలని కోరుతు న్నారు. ప్రభుత్వాలు మారినా ఆధునికయుగంలో ఎన్నో మార్పులు వచ్చిన రైతులకు లబ్ది చేకూరకపోగా నష్టాలే అధికంగా ఉంటున్నాయని వారిని ఆదుకునే పరిస్థితులు లేకపోవడం బాధాకరం అంటున్నారు. రైతులకు గిట్టుబాటుధర కల్పించడం దళారీవ్యవస్థను ఆపి, నాణ్యమైన విత్తనాలు తక్కువధరకు సబ్సిడీలలో ఎరువులు అందజేయాలని కోరుతున్నారు.

## క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు

**సిఐ పరశురాం**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాదారంలో నిర్వహించిన మాదారం ప్రీమియర్ లీగ్ (ఎంపిఎల్) సీజన్–6 క్రికెట్‌పోటీల ముగింపుకార్యక్రమంలో సిఐ విచ్చేసి మాట్లాడారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరుశురాం, ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్‌ల చేతులమీదుగా ఎంపిఎల్ విజేత జట్టుకు ట్రోఫిని అందజేసి క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఎంపిఎల్‌లో నాలుగు జట్లు పాల్గొనగా గేమ్‌చేంజర్, రెడ్‌బుల్స్ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. గేమ్‌చేంజర్స్ జట్టు క్రీడాకారులు అద్భుత ఆటతీరును ప్రదర్శించి విజయంసాధించారు. ఈసందర్భంగా నిర్వహకులు విచ్చేసిన సిఐ, మాజీప్రజాప్రతినిధులు, నాయకులను శాలువాతో సన్మా నించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, డిసిసి కార్య దర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నల్లోళ్ల రవికుమార్, ఎంపిఎల్ నిర్వహకులు సాయికుమార్, సందీప్, గణేశ్, ప్రభాకర్, సంతోష్, నరేశ్, నాయకులు మధు, సుదర్శన్, మల్లయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెంచర్లలో వక్ఫ్‌బోర్డు ఆంక్షలు ఎత్తివేయాలి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

లేఔట్లలో ప్లాట్లపై వక్ఫ్‌బోర్డు ఆంక్షలు తొలగించేవరకు బాధితులకు బిజెపి అండగా ఉంటుందని మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్ బి.చంద్రశేఖర్, ఇంచార్జ్ సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌లను కలిసి వెంచర్లపై వక్ఫ్‌బోర్డు ఆంక్షలు ఎత్తివేయాలని వినతిపత్రాలను అందజేశారు. ఘట్ కేసర్ మున్సిపల్‌పరిధిలో హెచ్‌ఎండిఏ వెంచర్లు పటేల్‌నగర్, ప్రైమ్‌లాండ్, ఏవి కన్‌స్ట్రక్షన్‌లలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు స్థలాలు కొనుగోలుచేశారని వక్ఫ్‌బోర్డుపేరుతో విధించిన ఆంక్షలతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ఆంక్షలు ఎత్తివేయాలనికోరారు. ఈకార్యక్ర మంలో బిజెపి రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, మంగు శ్రీనివాస్‌రావు, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి 56 ఫిర్యాదులు

**-ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి**

**-జిల్లా రెవెన్యూ అధికారి సంగీత**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చేసమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి సంగీత స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్నస్వామి కళ్యాణోత్సవం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లో సోమవారం శ్రీమల్లన్నస్వామి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. కాంగ్రెస్‌పార్టీ నాయకులు ముద్దం మల్లేశ్‌యాదవ్ నివాసంలో నిర్వహించిన మల్లన్న పండుగలో టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్‌లు పాల్గొన్నారు. ఒగ్గుకళాకారుల మంత్రోచ్చరణలతో కళాకారులబృందంచే ఘనంగా మల్లన్నస్వామి కళ్యాణం జరిపించారు. మహిళాభక్తులు స్వామికి వడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా నిర్వహకులు మల్లేశ్‌యాదవ్ నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈకార్య క్రమంలో పోచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బాలగౌని వెంకటేశ్‌గౌడ్, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

**పటాన్‌చెరు, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:**

పటాన్ చెరు మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. పటాన్ చెరు డివిజన్ కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో సోమవారం ఉదయం నూతన అధ్యక్షుడి గా నాయికోటి భోజయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులందరూ తమ తమ ప్రమాణ స్వీకారాలను పూర్తి చేశారు. నూతన కార్యవర్గంలో మున్నూరు కాపు కుల సభ్యులందరికీ సముచిత న్యాయం జరిగేలా కార్యవర్గాన్ని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్య క్షుడు నాయికోటి భోజయ్య మాట్లాడుతూ... ఎన్ని కల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రెండు కొత్త హామీలకుశ్రీకారం చేపడుతున్నామని అన్నారు. మున్నూరు కాపు కుల సంఘ సభ్యులలో ఎవరైనా అకాల మృతి చెందితే, గతంలో 10 వేలకే పరిమిత మైన దహన సంస్కారాల ఆర్థిక చేయూతను 21 వేలు అందించేలా నూతన కార్యవర్గం ఆమోదించిం దని అన్నారు. సంఘ సభ్యులలో ఎవరైనా పేద ఆడబిడ్డ కల్యాణానికి పూస్తే మెట్టెలు ఇస్తామని అధ్యక్షుడు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీలన్నింటినీ విడతల వారీగా అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

**కొలువుదీరిన పాలకమండలి.....**

గౌరవ అధ్యక్షులుగా బుచ్చయ్య, ప్రధాన కార్య దర్శిగా ఉప్పరి రమేష్‌కుమార్, ముఖ్య సలహాదా రుడిగా నర్ర బిక్షపతి, గౌరవ సలహాదారులుగా కాసాల శంకర్, బాయికాడి పెంటయ్య, కోశాధికారి గా గాదె మహేందర్, సహాయ కోశాధికారిగా మేకల శివకుమార్ ఉపాధ్యక్షులుగా నాయికోటి జీతయ్య, కాసాల యాదయ్య, నర్ర రామారావు, మైలారం అశోక్, గాదే సుధాకర్, యంజాల మల్లేష్ కార్య దర్శులుగా కొడకంచి భార్గవ్, మేకల జగదీష్, సంయుక్త కార్యదర్శులుగా గాదె శ్రీనివాస్, సంజీవ్, నాయికోటి సత్యం, నర్రా సత్యనారాయణ, ఉప్పరి అభిషేక్ కుమార్, ప్రచార కార్యదర్శులుగా యంజాల రాజేష్, మున్నూరు విక్రం, మల్లం పవన్, నాయికోటి శ్రీకాంత్ లతోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.


మున్నూరు కాపు సంఘం నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**అభినందించిన ఎమ్మెల్యే జీఎంఆర్.....**

పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మున్నూరు కాపు సంఘం కొత్త పాలక మండలిని అభినందించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయా లని సూచించారు. నూతన కార్యవర్గానికి తన సహ కారం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయికాడి విజయ్, నివర్తిదేవ్, ఎట్టయ్య, టప్పా కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి, ఉప్పరి నర్సింలు, పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

## బిజెపి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**-ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మార్చాలని ప్రయత్నం చేస్తున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సి పల్ పరిధిలోని 5,6,18 వార్డుల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పార్టీ ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల రిజర్వేషన్లను ఎత్తివేయాలని ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఏకమై పోరాటం చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామా ల్లో పాదయాత్ర చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు నక్క రేగొండ, సయ్యద్‌మతీన్, గుంటుకు శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, అజ్గర్, మహం కాళి చంద్రయ్య, మల్లేశం, అరుణ్‌కుమార్, సత్యనారాయణ, నర్సింలు, రవి, ముత్యాలు, శ్రావణ్‌కుమార్, ముత్యాలు, లింగం, కనకయ్య, గాడిపల్లి శ్రీని వాస్, జంగం రమేష్‌గౌడ్, సుభాష్‌చంద్రబోస్, రామచంద్రాచారి పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్

**కొండాపూర్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అనంతసాగర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యంతో పాటు మందులను అందజేసారు. రోటరీ క్లబ్ చందానగర్ డైరెక్టర్ సుభాష్కర్ కేరా మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతుగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు, మందులను ఉచితంగా అందిస్తామన్నారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఏఎంసి హాస్పిటల్ వారు విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సమాజ సేవ కోసం రోటరీ క్లబ్ సేవలు విశేషమైనవని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రంజిత్, సభ్యులు ఆదిత్య రెడ్డి, గోపికృష్ణ, వైద్యులు హరికిషన్, అఖిలా రెడ్డి, అలేఖ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## ఘనంగా యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే


యుకెజి గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని సెయింట్ విన్సెంట్ ఉన్నత పాఠశాలలో సోమవారం యుకెజి విద్యార్థులకు గ్రాడ్యు యేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ సేవియర్, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానెట్‌లు మాట్లాడుతూ విద్యార్థి బాల్యంలోని జ్ఞాన సముపార్జన దశలో ఇది అత్యంత కీలకమైన దశ అని అన్నారు. చిన్ననాటి నుండే క్రమశిక్షణతో మెలిగినట్ల యితే విద్యార్థులు మంచి ప్రయోజకులుగా తయారవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అలీన, సిస్టర్ రేణు, స్టెఫీ, శాలి, మరియరోస్, పిటిఏ చైర్మన్ డి.కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే : డాక్టర్ అన్నపూర్ణ

**గజ్వేల్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహిం చిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మానవుడు శారీరకంగా, సాంఘి కంగా, సామాజికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా ఉండా లని, నిజ జీవితంలో దినచర్య క్రియాశీలకమైనదని అన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాము, డ్యూటీ డాక్టర్ నవ్యరావు, డాక్టర్ తర్జని, హెడ్ నర్సులు విజయలక్ష్మి, శారద, జగదాంబ, రోజులిన్ వర లక్ష్మి, ఐసిఎస్‌వో మెహరాజ్, ఫార్మాసిస్టులు నర్సింలు, శ్రీనివాసచారి, విమల, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీలత, రమేష్, నర్సింగ్ ఆఫీసర్స్ వరలక్ష్మి, సునీత, షాహిన్, నజీర్, హెల్త్ అసిస్టెంట్స్ దేవసాని వాసుదేవ్, నాగరాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

**హత్నూర ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ సోమవారం నాడు హత్నూర మండలంలో ఘనంగా జరిగింది. మండల కేంద్రమైన హత్నూర లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించిన ర్యాలీ హత్నూర నుంచి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న దౌల్తాబాద్ చౌరస్తా వరకు పాదయాత్ర కొనసాగింది. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజనేయులు గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కరే కృష్ణ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హత్నూర నుంచి దౌల్తాబాద్ వరకు సాగిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. దౌల్తాబాద్ చౌరస్తాకు చేరుకున్న ర్యాలీ, అనంతరం బహి రంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతకర్షణలను ప్రేరేపిస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందు తుందని దుయ్యబట్టారు. మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన విధానాలు నిర్ణయాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కోలుకోలే ని స్థితికి చేరుకుందని ఆరోపించారు. జై బాపు జై భీమ్, జై సంవిధాన్ పేరిట చైతన్య యాత్రలు చేపట్టేందుకు పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిందని, అందులో భాగంగానే చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



పాదయాత్రలో డప్పు వాయిస్తున్న నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ

## రాజ్యాంగ రక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

### నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

**సిద్ధిపేట అర్బన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వెల్కటూర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపిసర్కారు మత రాజకీయాలకు పాల్పడుతూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా బిజెపి నాయకులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచారని తెలిపారు. అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రకు అన్ని వర్గాల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ, భిక్షపతి, అంజయ్య, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, పూజల గోపికృష్ణ, మహిపాల్‌రెడ్డి, ఎర్ర మహేందర్, శ్రీనివాస్, సాంబమూర్తి, సంతోష, ప్రవీణ్, నగేష్, మహేష్, శంకర్, వెంకటేశంగౌడ్, లింగంగౌడ్, కనకయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలకు ఆహ్వానం




మాట్లాడుతున్న మహంకాళి

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఉన్నత చదవులు చదివేల ప్రోత్సహించడమే లక్ష్యంగా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ పనిచేస్తుందని సొసైటీ అధ్యక్షుడు మహంకాళి అన్నారు. సిద్ధిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్డ్ క్యాస్ట్ విద్యార్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై తరగతులు చదువుతు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సొసైటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ పురస్కారాలు అందించడంతోపాటు ప్రతి విద్యార్థికి నగదు, ప్రశంసా పత్రం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అన్ని వర్గాల షెడ్యూల్ క్యాస్ట్ విద్యార్థులు ఈనెల 10లోగా సొసైటీ సభ్యులను సంప్రదించాలని లేదా 9440494886, 9866362177, 9553681116 నంబర్ల వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు పంపాలన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సహకారంతో సొసైటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సొసైటీ సభ్ములు పొన్నమల్ల రాములు, గ్యాదరి రామస్వామి, సత్యకృష్ణ, చంద్రం, సత్యనారాయణ పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లింగమూర్తి

**అక్కన్నపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. సోమవారం మండలంలోని మంచినీళ్ల బండ, గోవర్ధనగిరి, నందారం, ధర్మారం గ్రామాలలో గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కష్ట పడి పండించిన పంటలు దళారులకు అమ్మి నష్టపోవద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ద్వార ఈ కొనుగోళు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపిఎం శ్రీనివాస్‌గౌడ్, సీసీలు శివచరణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డబుల్‌బెడ్‌రూం నిర్మాణాలు పెండింగ్

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జున్‌రెడ్డి



అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూంలను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం పెండింగ్‌లో ఉందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూంలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇండ్లు లేని పేదల కోసం మంజూరు చేసిన డబుల్‌బెడ్‌రూం పనులు దాదాపు 70శాతం వరకు పూర్తయ్యాయని అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయని అనంతరం ప్రభుత్వం మారడంతో వాటిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. ఈ విషయంల ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతీసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గజ్వేల్‌పై రేవంత్‌రెడ్డి కక్షసాధింపు

### -మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):

గజ్వేల్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు ఆరోపించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌లో తొలి విడుతలో ఇందిరమ్మ ఇండ్లకు అర్హత సాధించిన లబ్ధిదారుల జాబితా ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. ఇందిరమ్మ కమిటీలు వేసినా వారి అభిప్రాయాలు తీసుకోకపోగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వివిధ అభివృద్ధి పనులకు ఇచ్చిన 180 కోట్ల నిధులను రద్దు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా గజ్వేల్‌లో కొత్తగా చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజల పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వడానికి రేవంత్‌రెడ్డికి మనసు రావడంలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గజ్వేల్ అభివృద్ధి కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

# స్థానిక ఎన్నికల్లో బిజెపిదే హవా

### -బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య



మాట్లాడుతున్న సింగం సత్తయ్య

**మర్కుక్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బిజెపిదే హవా కొనసాగనుందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, బిజెపి మండల అధ్యక్షుడు సాయి రెడ్డి రాంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మర్కుక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మొన్న జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించిన విషయం తెలిసిందే అన్నారు. రాబోయే మున్సిపల్, జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపర్చిన అభ్యర్థులే పెద్దసంఖ్యలో గెలువనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు బిజెపి అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేయాలని సూచించారు. అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని, ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేష్‌గుప్త, మాజీ సర్పంచ్ స్వరూప మల్లేశం, మాజీ ఎంపిటిసి చైతన్య శంకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొమురయ్య, బిజెవైఎం అధ్యక్షులు పంజ మధు, కోశాధికారి మహేందర్, ప్రధాన కార్యదర్శి కుంట సత్యం, సోషల్ మీడియా కన్వీనర్ కిషోర్‌రెడ్డి, నాయకులు క్రాంతి కుమార్, తుమ్మ ఐలయ్య, లక్ష్మీనరసింహా, సామెల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## బలహీన వర్గాల అభివృద్దే కాంగ్రెస్ ధ్యేయం

### పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండల్‌రెడ్డి

**ధూళిమిట్ట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** బడుగు, బలహీనవర్గాల అభివృద్దే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి అన్నారు. సోమవారం రోజున మండలంలోని కూటిగల్, రెడ్యానాయక్‌తండాలలో మండల కాంగ్రెస్ నాయకులతో కలసి జై బాపూ, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి రిజర్వేషన్లు ఎత్తివేయడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రజల హక్కులను కాలరాయాలని చూస్తున్న బిజెపిని రాష్ట్రంలో లేకుండా తరిమికొట్టాలన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ శివరాత్రి కుమార్, మండల అధ్యక్షులు కోల సాయిలుగౌడ్, జనగాం జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కమలాకర్‌యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుమన్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో ఇవ్వాలి

### కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:




కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని దీంతో రైతులకు నిరాశే మిగిలిందని తెలంగాణ రైతు రక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు మారెడ్డి రామలింగారెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు చేయనందుకు నిరసనగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులలో పంట రుణాల భారం పెరిగిపోతుందన్నారు. రైతు భరోసా నేటికి పూర్తిస్థాయిలో రైతులకు చెల్లించలేదన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో రుణమాఫీ, భరోసా డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో రైతు సంఘాలనాయకులు ఎ.వి.రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజేశం, యాదనరావు, సంతోష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకటరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపిని కలిసిన బిజెపి నాయకులు

**నర్సాపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు హైదరాబాద్లోని బిజెపి పార్టీ కార్యాలయంలో సోమవారం బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లా రాజకీయ పరిస్థితుల బిజెపి పార్టీ బలోపేతంపై తదితర విషయాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, నర్సాపూర్ టౌన్ ఉపాధ్యక్షులు సంఘసాని రాజు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ ఎంపి రఘునందన్‌రావును కలిసిన బిజెపి నాయకులు




విద్యార్థిని అశ్వినిని సన్మానించి మెమెంటో అందజేస్తున్న హరీష్‌రావు

## వరల్డ్ రికార్డు సృష్టించిన విద్యార్థిని

### అభినందించిన హరీష్‌రావు

**మర్కుక్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఒరగంటి అశ్విని ఇటీవల కలాం వరల్డ్ రికార్డు అవార్డు గ్రహీతగా నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం మాజీ మంత్రి హరీష్‌రావు వరల్డ్ రికార్డు సృష్టించిన అశ్వినిని శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. విద్యార్థినితో పాటు ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్యను అభినందించి సత్కరించారు. అనంతరం విద్యార్థిని అశ్విని పై చదువులకు తనవంతు సహాయం అందిస్తానని మాజీ మంత్రి హరీష్‌రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు సాధత్‌అలీ, నర్సింహారెడ్డి, రాజమౌళి, రవీందర్‌రెడ్డి, బ్రహ్మచారి, కొలుపుల రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని దామరకుంట పాఠశాల విద్యార్థిని అశ్వినిని మాజీ మంత్రి హరీష్‌రావు అభినందించి సత్కరించడం సంతోషంగా ఉందని మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి : ఎవో

**మర్కుక్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి వసంతరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన సర్వే సునీత సాగుచేసిన ఆయిల్‌ఫామ్ తోటలో గెలలను కోసి నంగునూరు మండలంలోని నర్మెట్ట గ్రామంలో గల పరిశ్రమకు తరలించినట్లు ఏఓ వసంతరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించిన ఆయిల్‌ఫామ్ సాగును రైతులు సాగుచేసుకొని సబ్సిడీ పొందాలని పేర్కొన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుచేసిన నాలుగు సంవత్సరాలకు రైతులకు ఆదాయం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రజినికాంత్, ఆయిల్‌ఫెడ్ అధికారి విజయ్, రైతులు స్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి 45వ అవిర్భావ దినోత్సవం



కుకునూరుపల్లిలో బిజెపి జెండాను అవిష్కరిస్తున్న అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

**కొండపాక, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ 45వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా కుకునూరుపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద బిజెపి మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి బిజెపి కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసి అధిక స్థానాలు గెలుపొందేలా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. ప్రజలకు బిజెపి అండగా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ సీనియర్ కార్యకర్తలను శాలువాలు కప్పి అయన సన్మానించారు. కార్యక్రమంలో జనరల్‌న సెక్రటరీలు, ఉపాధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి, మేదినిపూర్, తిప్పారం, రాయవరం గ్రామాల్లో పార్టీ బూత్ అధ్యక్షులు పార్టీ అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా కొండపాక మండల కేంద్రంలో అ పార్టీ మండల అధ్యక్షుడు నీల సత్యం అధ్వర్యంలో పార్టీ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు బాలకిషన్, మంచాల శ్రీనివాస్, ప్రశాంత్, నల్ల మల్లేశం, స్వామి, ప్రవీణ్ గౌడ్, బర్రె కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత బహుజనులకు అన్యాయం చేస్తున్న కేంద్రం

### యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి



మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆంక్షరెడ్డి

**మర్కుక్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం దళిత బహుజనులకు అన్యాయం చేసేందుకు రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి ఆరోపించారు. సోమవారం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పాములపర్తి, పాతూర్, మర్కుక్ గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం మహాత్మగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆంక్షరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందుతారని, కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకే గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, సన్న బియ్యంతో పాటు పలు పథకాలను నెరవేరుస్తుందని, రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలు వందశాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ బత్తుల మల్లేశం, మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, నాయకులు తిరుమల్‌రెడ్డి, పలు గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు ర్యాకం యాదగిరి, గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పత్తి నర్సింలు, సింగం వెంకటేశం, మొండి బిక్షపతి, ప్రవీణ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయన్న

## పూలె జయంతిని విజయవంతం చేద్దాం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ లింగాల సాయన్న అన్నారు. సోమవారం రోజున పట్టణ కేంద్రంలో దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహనీయుల ఉత్సవాలకు సంబందించి సన్నాహక సమావేశం నిర్వహించారు. కన్వీనర్ సాయన్న మాట్లాడుతూ మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈనెల 11వ తేదీన జరిగే మహాత్మ జ్యోతిరావు పూలే సందర్భంగా పట్టణంలోని పూలే విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రవిందర్, పచ్చిమట్ల రవిందర్‌గౌడ్, సింగరి, కొమ్ము భాస్కర్, కిష్టస్వామి, సంపత్, చిన్నా, బాలు, రవిందర్ తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కొండపాక, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన మెడబోయిన నర్సిలు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి రూ॥ 8 వేలు అర్థిక సహాయంగా అందించారు. అయన వెంట తిరుపతిరెడ్డి, ఉపేందర్ గౌడ్, నరేష్ యాదవ్ వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవం

**నర్సాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జక్కపల్లిలోగల తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలతోపాటు చదువులో ఉన్నతస్థాయికి ఏ విధంగా చేరుకావాలో ప్రిన్సిపాల్ పర్వాన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత చదువులు చదివి జీవితం ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా విధ్యార్థుల ఆటలు, పాటలు, డాన్సులు, పలువురిని ఎంతగానో అకట్టుకున్నాయి. అంతేగాక ఈ నెల 27న ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పర్వాన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ పాఠశాలపిడి అశోక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.















ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అంజిరెడ్డిని సన్మానిస్తున్న బిజెపి మండల అధ్యక్షుడు మల్లేష్

## అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మల్లేష్ గంగ్వార్

**న్యాల్‌కల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎమ్మెల్సీగా భారతీయ జనతా పార్టీ మద్దతుతో విజయం సాధించి సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సి.అంజిరెడ్డిని బిజెపి మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు సి గోదావరి అంజిరెడ్డి ఉన్నారు.

## సిర్గాపూర్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం



సిర్గాపూర్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న నేతలు

**సిర్గాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సిర్గాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో బిజెపి జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర ఇసి సభ్యులు అరుణ్‌రాజ్ శేరికార్, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి నాయకులు సుభాష్, పాటిల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సన్న బియ్యం పంపిణీ



జమ్లా తండాలో సన్నబియ్యం పంపిణి చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**సిర్గాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జమ్లా తండా, గైరాన్ తండాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మనీష్ పాటిల్ రేషన్ వినియోగదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన ప్రతి హామిని సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని మనిష్ పాటిల్ గుర్తు చేవారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జెస్సికా, పంచాయితీ కార్యదర్శి అనిల్, డీలర్ మహేశ్వర్‌సేట్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులుతుకారం జమ్లా తండా మాజీ సర్పంచ్ దివ్య భారతి చరణ్ గైరాన్‌తండా మాజీ ఉప సర్పంచ్ రాజు, కాంగ్రెస్ శ్రేణులూ పాల్గొన్నారు.

## శ్వాస మీద ధ్యాసపై అవగాహన



శ్వాస మీద ధ్యాసపై అవగాహన కల్పిస్తున్న ఆయూష్ డాక్టర్

**కంగ్టి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని కాశీ పొరదేవి ఆలయం లో మండల ఆయుష్ డాక్టర్ ఆధ్వర్యంలో సేవాలాల్ దీక్షా పరులకు ఆదివారం శ్వాస మీద ధ్యాసంపై ఆలయ పీఠాధిపతి, ఎమ్మెల్సీ బాబూసింగ్ మహారాజ్ అవగాహన కల్పించారు. ధ్యాస ద్వారా మనిషి అంతర్ రోగాన్ని జయిస్తాడని, ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమం లో సిర్గాపూర్ మండలం అంతర్‌గావ్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ ఏకంగా 15 గంటలపాటు ధ్యానం చేసి అందరిని అబ్బుర పరిచారు. ధ్యానంతో జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మనిషికి ప్రశాంతత, పరస్పర అవగాహన కలుతుగుందని చెప్పారు.

## ఆదర్శ్‌రెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ నేతలు



ఆదర్శ్‌రెడ్డిని సన్మానిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా నియామకం అయిన వెన్నవరం అదర్శ్ రెడ్డిని నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరు గోపాల్ ముదిరాజ్, ప్రమోద్‌రెడ్డి, బిజిలి రాజు, జగదీశ్వర్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు యూనిస్, మాజీ ఎంపిటిసి సభ్యులు అనిల్, బిఆర్ఎస్ నాయకులు గోపి, జనార్ధన్‌రెడ్డి, రఘుపతిరెడ్డిలు సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## 62వ రోజు కొనసాగిన నిరసన దీక్షలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 7 ప్రభాతార్త:** నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 62వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు మద్దతుగా బిజెపి మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ మద్దతు తెలిపి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే డంపింగ్ యార్డ్ ఏర్పాటును రద్దు చేయాలన్నారు. లేనియెడల పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జై జవాన్.. జై కిసాన్, డంపింగ్ యార్డ్ వద్దంటూ నినాదాలు మారుమ్రోగాయి. కార్యక్రమంలో నలవల్లి గ్రామ బూత్ అధ్యక్షులు శేఖర్, మధు ముత్యాలుగౌడ్, తుజ్జాల్పూర్ రాజు, రాజశేఖర్, సత్యనారాయణ, భిక్షపతి గౌడ్, గ్రామస్థులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా దీక్ష చేస్తున్న దృశ్యం

# గ్రీన్ క్యాంప్‌గా సుల్తాన్‌పూర్ జెఎన్‌టియు

## త్వరలో విద్యార్థులకు సైకిళ్లు అందజేత



సుల్తాన్‌పూర్‌లో జెఎన్‌టియు కళాశాల

**చౌటకూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఇక గ్రీన్ క్యాంపస్‌గా మారనుంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ చొరవతో కళాశాల క్యాంపస్‌లో కాలుష్య సహితవాహనాలు 100 సైకిళ్లను(బాలురకు 60, బాలికలకు 40) మంజూరు చేయించారు. త్వరలో మంత్రి దామోదర్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు. సువిశాల విస్తీర్ణంలో కొననాగుతున్న కళాశాలలో 1500 మందికి పైగా విద్యార్థులు విద్యను అందుకుంటున్నారు. కళాశాల గ్రామానికి దూరంగా ఉండటంతో విద్యార్థులు వ్యయ ప్రసాలకు ఓర్చి కాలి నడకన కళాశాలకు రావాల్సి వస్తోంది.

**కోటి 97 లక్షలతో అభివృద్ధి పనులు...**

గత ఏడాది మంత్రి దామోదర్ కళాశాలను సందర్శించి మౌలిక వసతులను తీరుస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా కోటి 97 లక్షల రూపాయలను మంత్రి మంజూరుచేసి పలు అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో కళాశాల ప్రధాన ద్వారానికి ఇరువైపుల నిర్మించి ఉన్న ప్రహరీ గోడను కూల్చివేయగా కొంత భూమిని కళాశాల కోల్పోవాల్సి రాగా ఎన్‌హెచ్ఏఐ 4 లక్షల రూపాయల పరిహారం అందించింది. పరిహారం అందుకున్న 4 లక్షలతో ప్రహరీగోడ నిర్మాణం పూర్తి కాదని ప్రిన్సిపాల్ నరసింహ మంత్రి దామోదర్ దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సిఎస్ఆర్ కింద కోటీ 4 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. ఎడమ వైపు భూసేకరణ వివాదాస్పందంగా ఉండటంతో కుడివైపు ప్రహరీగోడను నిర్మాణ పనులు పూర్తి చేశారు. 78లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాంచారు. అదనంగా మరో రూ.15 లక్షల మంజూరు కాగా సిమెంట్ రోడ్డు పనులు పూర్తి చేశారు. మరో 4 లక్షల సీఎస్ఆర్ నిధులతో సైకిల్ షెడ్‌ను నిర్మించారు.

**జేఎన్టీయూలో సకల సౌకర్యాలు:మంత్రి దామోదర్**

జేఎన్టీయూ కళాశాలకు మంచి భవిష్యత్తు ఉంది. ఇప్పటికే సకల సౌకర్యాలను సమకూర్చారు. రానున్న రోజుల్లో యూనివర్సిటీగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. 150 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో కళాశాల విస్తరించి ఉంది. వసతి గృహ సముదాయాలు, తరగతుల నిర్వహణకు భవనాలు నిర్మించారు. సోలార్ ప్లార్, తాగునీటి అవసరాలకు మంజీర నీరు ఇంటర్నెట్ సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పించామని మంత్రి దామోదర్ పేర్కొన్నారు.



సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

## సన్న బియ్యం పంపిణీతో పేదల కళ్లల్లో ఆనందం

### -టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** సన్న బియ్యం పంపిణీతో పేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో రేషన్‌కార్డు దారులకు 6కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, తాజా మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నాయకులు లక్ష్మీ నారాయణ, కురుమ లక్ష్మయ్య, డీలర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

**వెల్దుర్తి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు వారి ప్రతిభను కనబరిచి నృత్యాలతో అలరించారు. విద్యార్థుల నృత్యాలు, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డితో పాటు నాయకులు నరేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేతకి చైర్మన్‌ను ఆశీర్వదించిన సిద్దేశ్వరానందగిరి మహారాజ్

**ఝరాసంగం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వర స్వామి ఆలయ కమిటి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌పాటిల్ బర్దీపూర్‌లో దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 1008 డాక్టర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌ను, ధనసిరి మఠాధిపతి వీరేశ్వర శివాచార్య మహాస్వామిజీని కలుసుకుని ఆశీర్వచనాలు అందుకున్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**కొల్చారం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ సూచించారు. సోమవారం కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామంలో ప్రజలకు సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఎవరు కూడా తమ ఫోన్‌కు వచ్చే పాస్‌వర్డ్‌ను ఇతరులతో పంచుకోవద్దన్నారు. మల్టీ ఫ్యాక్టర్ లాగిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బలమైన పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.




సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహమ్మద్ గౌస్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

## ఖేడ్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బస్ డిపో సమీపంలో పద్మశాలి కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ప్రజలకు ప్రధాన అవసరమైన సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. నారాయణ ఖేడ్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. అనంతరం పద్మశాలి కాలనీవాసులు సంజీవరెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, నాయకులు శెట్టి శంకర్, పండరి రెడ్డి, కుచిని ప్రకాష్, శ్రీశైలం, పంతంగి రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి కాలనీవాసులు నారాయణఖేడ్ శాసన సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**కొల్చారం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎనగండ్ల గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ మూడవ వార్షికోత్సవంతో పాటుగా కళ్యాణ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, మంజుల కాశీనాథ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 16న కెఎస్ పిపి పట్టభద్రుల దినోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**పటాన్ చెరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

ప్రతిష్టాత్మక కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) తృతీయ పట్టభద్రుల దినోత్సవాన్ని ఏప్రిల్ 16న (బుధవారం) గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర్ సెమినార్ హాలులో నిర్వహించనున్నారు. పబ్లిక్ పాలసీ స్నాతకోత్తర (పీజీ) డిగ్రీని పూర్తిచేసిన దాదాపు 30 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలను ప్రదానం చేయనున్నారు. దీనికి ముఖ్య అతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు హాజరు కానున్నారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్, ఉపకులపతి ఎర్రోల్ డిసౌజా, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, కేఎస్ పీపీ డీన్, రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ చిరస్మరణీయ సందర్భం గ్రాడ్యుయేషన్ విద్యార్థుల కృషి, అంకితభావాన్ని గుర్తించడమే కాకుండా, ప్రగతిశీల, సమ్మిళిత సమాజాన్ని రూపొందించడంలో ప్రజా విధానం యొక్క కీలక పాత్రను కూడా నొక్కి చెబుతుంది. పాలనలో నాయకులను ప్రోత్సహించాలనే తన లక్ష్యాన్ని కేఎస్ పీపీ కొనసాగిస్తున్నందున, ఈ కార్యక్రమం ప్రజాక్షేత్రంలో అర్థవంతమైన మార్పును నడిపించడానికి భవిష్యత్ సహచరులకు ప్రేరణగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నారు.

# సన్న బియ్యం పంపిణీ దేశానికి ఆదర్శం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** పేదలకు సన్న బియ్యం పంపిణీ ఓ సంచలనమని, దేశానికే ఆదర్శమని ఎమ్యెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మండలం పంచాగమ రేషన్‌షాప్‌లో పేదలకు ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యన్ని అందిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీగెలిచిన మొదటి సంవత్సరంలోనే ప్రతి గ్రామానికి, తండాలకు సిసి రోడ్లు, డ్రైనేజీ మురికి కాలువలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎండాకాలం వస్తున్న సందర్భంగా నీటి సమస్య రావొద్దని ముందుగానే అధికారులతో సమావేశం నిర్వహించి పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పట్లోళ్ల విఠల్‌రెడ్డి, పంచగమా ప్రజలు, పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం...**

**నారాయణఖేడ్, ఏప్రిల్ 7ప్రభాతవార్త:**

దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధించాలన్నా ఆరోగ్యవంతమైన ప్రజల నిరంతర కృషివల్లే అది సాధ్యమవుతుందని, అందుకోసం ప్రతి ఒక్కరు ఆరోగ్య నియమాలను పాటిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, శాసన సభ్యులు సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరల్డ్ హెల్త్‌డే సందర్భంగా గ్లోబల్ ల్యాబ్ సౌజన్యంతో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట్రావు, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం యాదగిరి, లయన్స్ సభ్యులు చంద్రశేఖర్, ఆచార్య, రాజ కుమార్, హమీద్, అబ్రహార్, ఉపాధ్యాయులు రాజయ్య, సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.

## కంది తహసీల్దార్‌గా ఆశా జ్యోతి బాధ్యతల స్వీకరణ

**కంది, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కంది మండల తహసీల్దార్‌గా ఆశా జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాథోడ్ విజయలక్ష్మి సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయానికి సూపరింటిడెంట్‌గా బదిలీ కాగా ఆశా జ్యోతి మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

**సిర్గాపూర్ తహీల్దార్‌గా అబ్దుల్‌నజీమ్ ఖాన్...**

**సిర్గాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల తహసీల్దార్‌గా అబ్దుల్ నజీమ్‌ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఉమాశంకర్ అందోల్ మండలానికి బదిలీపై వెళ్లగా కంగ్టిలో విధులు నిర్వహించిన అబ్దుల్ నజీమ్ ఖాన్ సిర్గాపూర్ మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

**కంగ్టి తహసీల్దార్‌గా భాస్కర్...**

**కంగ్టి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల తహసీల్దార్‌గా సి.భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు విధులు నిర్వహించిన తహసీల్దార్ సిర్గాపూర్‌కు బదిలీ కాగా నారాయణఖేడ్ తహసీల్దార్‌గా సేవలు అందించిన సి.భాస్కర్ మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న సి భాస్కర్‌ను డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ హైమద్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది సి భాస్కర్‌ను ఘనంగా స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు.

**మనూర్ తహసీల్దార్‌గా విష్ణుసాగర్**

**మనూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల తహసీల్దార్‌గా ఎన్‌బి విష్ణు సాగర్ సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వెంకటస్వామి అమీన్‌పూర్ మండలానికి బదిలీ కాగా విష్ణుసాగర్ మండలానికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ప్రజలక అందుబాటులో ఉండి రెవిన్యూ పరమైన సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**అందోలు తహసీల్దారుగా ఉమాశంకర్...**

**జోగిపేట ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** అందోలు తహశీల్దారుగా ఉమాశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అందోలు తహశీల్దారు విష్ణుసాగర్‌ను మనూరు మండలానికి బదిలీ చేశారు. సిర్గాపూర్ మండల తహశీల్దారుగా పనిచేస్తున్న ఉమాశంకర్‌ను అందోలుకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారంనాడు బాధ్యతలు చేపట్టారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు

**కొండాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల తహసీల్దార్‌గా అశోక్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ అశోక్‌ను రేషల్‌డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రేషన్ డీలర్లతో సమావేశం అయ్యారు. సన్న బియ్యం పంపిణిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, రేషన్ దుకాణం కొనసాగించాల్సిన సమయంపై తహసీల్దార్ డీలర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## గుమ్మడిదల నూతన తహసీల్దార్‌గా పరమేశం

**గుమ్మడిదల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల నూతన తహశీల్దార్‌గా పరమేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరిస్తూనే రేషన్ షాపులపై ఉక్కు పాదం మోపారు. మండల పరిధిలోని పలు గ్రామాల రేషన్ షాపులను తనిఖీలు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వాల్టా చట్టానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్థంభం ప్రతిష్టాపన

**పాపన్నపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్థంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దల మధ్య ఘనంగా కొనసాగాయి. ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి మహారాజ్ హాజరై ప్రతిష్టాపన చేశారు. ధ్వజస్థంభం దాత గజవాడ రాజేశ్వర్‌గుప్త సహకారంతో ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలోని స్వామి వారిని, అతిథిగా హాజరైన మాధవానంద సరస్వతి మహారాజ్‌ను దర్శించుకున్నారు.

**ఘనంగా బోనాలు...**

పాపన్నపేటలోని వెంకటేశ్వరగుట్ట సమీపాన శ్రీరామనవమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి బోనాలు ఊరేగింపు కనుల విందుగా కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా మంగళవారం అగ్ని గుండాలతో పాటు రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## నేటి నుంచి న్యాల్‌కల్‌లో రేణుక ఎల్లమ్మ నాటకం

**న్యాల్‌కల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ఈనెల 8వ తారీఖు నుంచి మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించుకున్నారు. నాటక ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో బోనాల ఊరేగింపు,మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 8న రాత్రి 9 గంటలకు నాటకంలో భాగంగా గణపతి ప్రవేశం, నారధముని జమదగ్ని ప్రతిజ్ఞా నెరవేర్చుట, జమదగ్ని ఎల్లమ్మ ప్రవేశం ఉంటుందన్నారు 10వ తారీకున రాత్రి 9 గంటలకు ఎల్లమ్మ పెళ్లి, జమదగ్ని పశువుల మేపులకు వెల్లుట, కార్తికులు జమదగ్నిని చంపుల, ఎల్లమ బోనాలు తెచ్చుట ఉంటుందన్నారు. 12న రాత్రి 9 గంటలకు కుమ్మరి వారి ప్రవేశం, ఎల్లమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె పుట్టుట, గంగాదేవి ప్రవేశం ఉంటుందన్నారు 14న రాత్రి 9 గంటలకు తల్లికి తండ్రికి పేరు చెప్పమని తల్లికి బాధించుట, ఎల్లమ్మ కారగృహంలోకి వెళ్లుట, ఈ నెల 16న రాత్రి 9 గంటలకు శిరియాల పరశురాముడు కలిసి తండ్రిని లేపుతా ఎల్లమ్మకు జమదగ్నికి నాగవెల్లి జరుపుక నాటకాన్ని కళాకారులు ప్రదర్శిస్తారన్నారు. గ్రామంలో నాటకాలు వేయడం గత 5 దశాబ్దాల నుంచి కొనసాగుతూ వస్తోంది. రోజు విడిచి రోజు నిర్వహించే నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానుండటంతో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా నాటకం నిర్వాహకులు తగు ఏర్పాటు పూర్తి చేశారు.

## గుమ్మడిదలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**గుమ్మడిదల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం గుమ్మడిదల మండల పరిధిలో అన్ని గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆరోగ్యం అవగాన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, సుఖవంతమైన ప్రసవం, తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండాలంటే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు. ప్రైవేట్ ఆసుపత్రులను నమ్ముకొని లక్షలు పోగొట్టుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే గర్భిణీ స్త్రీలకు సుఖ ప్రసవం కోసం ప్రాముఖ్యత ఇస్తుందని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై అవగాహన చికిత్సలు చేయడం, అనేక రకాల సంక్రమిక వ్యాధులపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ప్రభుత్వం వైద్యశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఆరోగ్యం పట్ల సందేహం వస్తే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యుల సూచన మేరకు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, శ్రీలక్ష్మీ,, వీణ కుమారి, సూపర్‌వైజర్‌లు వసంత, శశికళ, ఎస్తేరు, సరూప, ఏఎన్ఎంలు, వివిధ గ్రామాలలోని ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం